



కిక్కిరిసిన క్యూలైన్లు..

పోలమాంబ చదురుగుడి క్యూలైన్లన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ఉదయం 11 గంటల వరకు సాధారణంగానే భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం తర్వాత అమ్మవారి దర్శనానికి వేలాదిగా జనం తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు దాటి ప్రధాన రహదారి వరకు భక్తులు బారులుదీరారు. గతేడాదితో పోలిస్తే శంబరలో భక్తుల సంఖ్య బాగా తగ్గింది. కాగా క్యూలైన్లలో ఉన్నవారికి ఇబ్బందులు తప్పలేదు. ఆలయ సిబ్బంది కనీసం తాగునీటి ప్యాకెట్లు అందించలేదు. చిన్నపిల్లలకు పాలు కూడా ఇవ్వలేదు. కౌంటర్ల సంఖ్య తగ్గించడంతో భక్తులు ప్రసాదం కొనుగోలుకు అవస్థలు పడాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పది వారాల పాటు నిర్వహించే అమ్మవారి పండగలో ప్రథమ వారం భక్తులకు కనువిందు చేసే కార్యక్రమాలేవీ నిర్వహించలేదు. ఈ ఏడాది జాతరలో కోయ, థింసా, కొమ్ము, బిందెల డ్యాన్సులు, పులి వేషాలు, తప్పెటగుళ్ల ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలేవీ కానరాలేదు. గ్రామంలో ఎక్కడా ప్రసాదాలు, భోజనాల వితరణ కనిపించ లేదు. దీంతో తీవ్ర నిరాశ చెంది భక్తులు వెనుదిరిగారు. రాష్ట్రస్థాయి పండుగగా గుర్తించినా ఆ స్థాయిలో సౌకర్యాలు, ఏర్పాట్లు చేయకపోవడంపై భక్తజనం పెదవి విరిచారు. కనీసం మారు వారంలోనే ఈ పరిస్థితి లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

అంబరాన సిరి శంబరం



- శంబరలో ఘనంగా సిరిమానోత్సవం
- మార్మోగిన పోలమాంబ నామస్మరణ
- రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమై.. గంటలోనే ముగిసిన వేడుక

అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తురాలు

(మక్కువ/సాలూరు,/సాలూరు రూరల్,జనవరి 23)

సిరి సంబరం అంబరాన్నంటింది. భక్తజనం పులకించింది. అంతటా పోలమాంబ నామస్మరణ మార్మోగింది. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా సిరిమానును తాకి పులకించి పోయారు. చీరెలు, కోళ్లు, పసుపు, కుంకుమలు, అరటిపండ్లు సమర్పించారు. పాహిమాం.. పోలమాంబ అంటూ మొక్కుకున్నారు. భక్తజన హోరు మ ధ్య సంప్రదాయబద్ధంగా సాగిన సిరిమా ను ఊరేగింపును వందలాది మంది ఇళ్లపై నుంచి వీక్షించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించు కున్నారు. వేలాది మంది రాకతో గ్రామం కళకళలాడింది. బంధువులు, స్నేహితులతో గ్రామంలోని వీధులన్నీ కిక్కిరిసిపోయాయి.



సిరిమానుపై భక్తులకు దర్శనమిస్తున్న పూజారి జన్ని పేకాపు భాస్కరరావు



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ

ఆలస్యంగా ప్రారంభం

ఏటా మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించాల్సిన సిరిమాను ఉత్సవం ఈ సారి ఆలస్యమైంది. సాయంత్రం 4:35 గంటలకు సిరిమానోత్సవం ప్రారం భమవడంతో భక్తులు తీవ్ర అసహనాని కి గురయ్యారు. సిరిమానును పూజారి జన్నిపేకాపు భాస్కరరావు అధిరోహించారు. పోలీసుల మూడంచెల భద్రత నడుమ సిరిమానోత్సవం గంటలోనే ము గిసింది. సిరిమాను, ఘటాలు తొలుత గిరడ వారింటికి వెళ్లాయి. గిరడ కు టుంబీకులు పూజలు చేసిన అనంతరం కుప్పిలి, పూడి వారిళ్లకు సిరిమాను వెళ్లింది. ఆయా కుటుంబీకులు సిరిమాను కు పూజలు చేసిన తర్వాత ఘటాలు దక్షణ దిక్కుగా, సిరిమాను తూర్పు దిక్కుగా వెళ్లాయి. ఘటాలు, సిరిమాను మళ్లీ పనుకువీధిలో కలిశాయి. అక్కడ పాడిపిరెడ్డి కుటుంబీకులు తీళ్లవారి వారసులుగా అ క్యాన కుటుంబీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం సిరిమాను వెనక్కి వచ్చి గొల్లవీధి, కొత్తవీధుల మీదుగా పెద్దమ్మ గుడివద్దకు చేరుకుంది. అక్కడ వేచి ఉన్న భక్తులు పెద్దసంఖ్యలో పూజలు చేశారు. అక్కడ నుంచి వెనుదిరిగిన సిరిమాను నడివీధికి చేరుకుని ఆగిపోయింది. అక్కడ పాడేపు కుటుంబీకులు మళ్లీ జన్నిపేకాపు భాస్కరరావును సిరిమాను నుంచి దింపి భుజాలపై చదురుగుడికి తీసుకువెళ్లారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 600 మంది పోలీసులతో భారీ భద్రతా చర్యలు చేపట్టారు. ఏఎస్పీ సునీల్ సోరెన్, సాలూరు సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో రోప్ పార్టీ ఏర్పాట్లు చేశారు. పార్వతీపురం ఆర్డీవో హేమలత, పోలీసు ఉన్నతాధికారులు గ్రామంలోని తిరుగు తూ సిబ్బందికి పలు సూచనలు అందించారు.

విద్యుత్ తీగలను ఈడ్చుకెళ్లిన టిప్పర్

- నేలకొరిగిన 13 స్తంభాలు
- 5 గ్రామాలకు నిలిచిన సరఫరా



ప్రమాదానికి కారణమైన టిప్పర్

మెంటాడ, జనవరి 23 : జాతీయ హరిత రహదారికి గ్రావెల్ తరలిస్తున్న ఓ టిప్పర్ సోమవారం రాత్రి విద్యుత్ తీగలను ఈడుకెళ్లింది. దీంతో 13 స్తంభాలు నేల కొరిగాయి. విద్యుత్ శాఖ ఏఈ తిరుపతి అందించిన వివరాలు ప్రకారం.. జాతీయ హరిత రహదారి నిర్మాణానికి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ పైభాగానికి మర్రివలస సమీపంలో విద్యుత్ తీగలు తగులకొని ఉండిపోయాయి. దీన్ని డ్రైవర్ గమనించలేదు. దీంతో విద్యుత్ తీగలను ఈడ్చుకుంటూ వాహనం ముందుకు వెళ్లడంతో వరుసగా 13 స్తంభాలు నేలకొరిగాయి. కొన్ని సంబాలు విరిగి పోయాయి. దీంతో ఆగూర పంచాయతీలోని మధుర, మర్రివలస, సారాడవలస, సిగడంవలస సంగం, గుడ్డివలస కిందగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం నాటికి విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని ఏఈ తిరుపతి తెలిపారు.



నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

జగనన్నా.. నీకు ఓటు అడిగే హక్కు ఉందా?

- ఎక్కడ చూసినా మద్యమే
- పెరుగుతున్న నిరుద్యోగం
- జలయజ్ఞం ఏమైంది
- బీజేపీకి ఊడిగం చేస్తున్న వైసీపీ
- హోదా కోసం ఒక్కసారైనా ఉద్యమించారా?
- వైఎస్ ఆశించిన అభివృద్ధి ఇదేనా?
- పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/రింగురోడ్డు

'అధికారంలోకి వస్తే మద్యపానం నిషేధిస్తామని జగనన్న హామీ ఇచ్చారు. ఈ హామీని నెరవేర్చకపోతే మళ్లీ ఓటు అడగనని చెప్పారు. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతోంది. మరి ఓటు అడిగే హక్కు జగనన్నకు ఉందా?. అని ప్రశ్నిస్తున్నా' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం అయోధ్య మైదానం రోడ్డులోని క్షత్రియ కల్యాణ మండపంలో ఉమ్మడి విజయనగరం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌పై ఘాటు విమర్శలు చేశారు. 'మద్యంతో కలుగుతున్న అనర్థాలను కళ్లారా చూశా. శ్రీకాకుళం నుంచి బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఓ మహిళ ఆవేదనను విన్నాను. మద్య నిషేధం విధించని జగనన్నకు ఓటు అడిగే హక్కులేదు. మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంపైనే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. మద్యపాన నిషేధం చేయకపోతే మళ్లీ ఓటు అడగనని చెప్పి ఇపుడు ఏ మొఖంతో ఓట్లు అడుగుతావని జగనన్నను ప్రశ్నిస్తున్నా. జగన్ రెడ్డి అంటే వైసీపీ వారికి నచ్చడం లేదు. ఇకనుంచి జగనన్న అనే సంబోధిస్తా. వైఎస్ అధికారంలో ఉన్నపుడు చేపట్టిన ప్రాజెక్టులు సైతం ఇప్పటికీ పూర్తి చేయలేని పరిస్థితి. అభివృద్ధి జాడలేదు. సాగునీటి ప్రాజెక్టుల ఊసులేదు. పరిశ్రమల స్థాపనలేదు. ఇవీ వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు. జలయజ్ఞం పేరుతో అన్ని జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులను వైఎస్ చేపడితే జగనన్న వాటిని పడకేయించారు. జిల్లాల్లో పర్యటిస్తున్నపుడు వీటిని గమనిస్తున్నా. తాను పాదయాత్ర చేసినపుడు దివ్యాంగుల సమస్యను గుర్తించి వారికి ఏదైనా ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని జగనన్నను కోరా. కానీ ఎటువంటి స్పందన రాలేదు. జాబ్ క్యాలెండర్ ఎన్నికలు రెండు నెలలు ఉండగా ఇస్తున్నారు. మరి జాబ్‌లు ఎప్పుడిస్తారు సార్. మన రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీకి ఊడిగం చేస్తూ బానిసలయ్యారు. బీజేపీ మతతత్వ పార్టీ కావటం వల్లే వైఎస్ వ్యతిరేకించారు. కానీ ఆయన కుమారుడు జగనన్న మతతత్వ పార్టీకి బానిసలయ్యారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని ఒక్కసారైనా ఉద్యమం చేశారా?.అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

షర్మిల దృష్టికి సమస్యలు

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు పలు సమస్యలను షర్మిల దృష్టికి తీసుకెళ్లారు. మన్యం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింహాచలం మాట్లాడుతూ.. కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి అవినీతి అక్రమాలను వెల్లడించారు. కనీస అభివృద్ధికి నోచుకోకుండా మన్యం జిల్లాను తయారు చేశారన్నారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మళ్లించుకుపోతున్నా ప్రశ్నించడం లేదన్నారు. ఒక్క అభివృద్ధి పనిని కూడా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ఎమ్మెల్యే మాత్రం తన ఇంటికి కోట్లు వెచ్చించి రోడ్డు వేయించుకున్నారని విమర్శించారు. గిరిజనాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సరగడ రమేష్ మాట్లాడుతూ .. విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. చాలామందికి కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్ పెట్టిందన్నారు. అలాంటి పార్టీని వీడి వేరే పార్టీలోకి వెళ్లారన్నారు. వైఎస్ షర్మిలతో మళీ కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో పూర్వ వైభవం వస్తుందన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.



విజయనగరంలో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

ఘన స్వాగతం

పీసీసీ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారిగా జిల్లాకు వచ్చిన షర్మిలకు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. విజయనగరం, పార్వతీపురం జిల్లాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆమెపై పూలవర్షం కురిపించారు. డప్పు వాయిద్యాలతో సమావేశ మందిరానికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



కార్యకర్తలు అందించిన బొబ్బిలి వీణను చూపిస్తున్న షర్మిల


రెండో విడత వేలం రద్దు..

లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం పరిధిలోని భూములను గతేడాది ప్రభుత్వం అనేక ఒడిదొడుకుల మధ్య బహిరంగ వేలం నిర్వహించింది. మొదటి విడతలో సుమారు 60 ఎకరాలకు పైగా భూములను వేలం వేశారు. ఆ భూ ములు వాణిజ్య భూముల జాబితాలో ఉన్నాయి. దీంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆ భూములను వేలంలో దక్కించుకున్నారు. ఇందులో కొంతమంది అధికార పార్టీ నాయకులు తమ వంతు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండో విడతలో సుమారు 19 ఎకరాల భూములు, ఇతర ఆస్తులను కూడా మళ్లీ పలు ఒడిదొడు కుల మధ్యం వేలం వేశారు. మొత్తం భూములన్నీ రియల్ ఎస్టేట్‌గా అవతరించాయి. వాటిని అమ్ముకునే పనిలో వేలం దారులు నిమగ్నమయ్యారు. అయితే, రెండో విడత భూముల వేలం ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని కొందరు హైదరాబాద్‌కు చెందిన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించారు. దీంతో రెండో విడత వేలం ప్రక్రియను రద్దు చేస్తూ ఎన్‌సీఎల్‌టీ ఇటీవల తీర్పునిచ్చింది.

ఆందోళనలో కొనుగోలుదారులు..

ఎన్‌సీఎస్ యాజమాన్యానికి సంబంధించిన దివాళా పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున ఫ్యాక్టరీకి చెందిన స్థిరాస్తిని రూ.20.05 కోట్లకు వేలం ద్వారా విక్రయించి చేసిన రిజిస్ట్రేషన్‌ను ట్రిబ్యునల్ రద్దు చేసింది. దీంతో బహిరంగ వేలంలో భూములను కొనుగోలు చేసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ భూముల్లో ప్లాట్లు వేసి అమ్ముకుంటున్న వారికి ట్రిబ్యునల్ ఆదేశాలు శరాఘాతంలా మారాయి. ఈ భూములపై వారు ఆశలను వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని నుంచి ఎలా బయటపడాలో తెలియక వారు మల్లగుల్లాలు పడుతున్నారు.

చేతులెత్తేశారు!



ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం

- జిల్లాలో తెరచుకోని చక్కెర పరిశ్రమలు
- హామీ ఇచ్చి మోసం చేసిన వైసీపీ నేతలు
- ఎన్‌సీఎస్ ఆస్తుల వేలం ప్రక్రియ రద్దు
- కొనుగోలుదారుల్లో ఆందోళన
- మారని రైతుల పరిస్థితి

బొబ్బిలి, జనవరి 23: 'జిల్లాలో మూతపడిన లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ, భీమసింగి సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తాం. చెరకు రైతులను ఆదుకుంటాం'. అంటూ గత ఎన్నికల ముందు వైసీపీ నాయకులు విపరీతమైన వాగ్దానాలు చేశారు. దీంతో ఈ ప్రాంత చెరకు రైతులంతా ఎంతగానో సంతోషించారు. చక్కెర కర్మాగారాలు పూర్వవైభవంతో వెలిగిపోతే కష్టాలు తీరిపోతాయని భావించారు. అయితే, ఇదంతా అభూతకల్పనేనని రైతులకు అనతి కాలంలోనే తెలిసిపోయింది. ఎప్పటిలాగే చక్కెర కర్మాగారాలు పీకల్లోతు సంక్షోభంలోకి కూరుకుపోయాయి. రైతులు, ఉద్యోగులకు చెల్లింపులు జరపలేని దుస్థితికి దిగజారిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు, రైతు సంఘాలు చెరకు బిల్లుల బకాయిల కోసం అలుపెరగని పోరాటాలు సాగించారు. లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర మిల్లును జాతీయకరణ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. రెవెన్యూ రికవరీ యాక్టును అమలు చేసి బిల్లుల చెల్లించాలన్న డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేసింది. ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీ ఆస్తుల వేలం ప్రక్రియను రెండు దఫాలుగా నిర్వహించి రైతులకు బకాయిలను చెల్లించేసి మమ అనిపించింది. ఆ తరువాత ఫ్యాక్టరీని నడిపేందుకు అవసరమైన చర్యలు మాత్రం చేపట్టలేదు. ఈ ప్రాంత చెరకును రేగిడి మండలం సంకిలి ఫ్యాక్టరీకి తరలించుకోవాలని రైతులకు ఓ ఉచిత సలహా పారేసి చేతులు దులుపుకుంది.

సమస్య పరిష్కారమయ్యేనా?..

తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండి అన్న ధోరణిలో ప్రభుత్వం వ్యవహరించిన కారణంగానే ఇలాంటి పరిస్థితి దాపురించింది. నిబంధనలను సక్రమంగా పాటించి వేలం నిర్వహించి ఉంటే కోర్టు చిక్కులు ఉండేవి కావన్న వాదన వినిపిస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో, వేలందారులకు ఎటువంటి పరిష్కారం చూపుతుందోనని సర్వత్రా ఎదురు చూస్తున్నారు. రైతుల బకాయిల చెల్లింపు పూర్తవడంతో ప్రభుత్వంపై ఒక రకమైన ఒత్తిడి తొలగిపోయి కొత్త చిక్కు వచ్చిపడింది. ఫ్యాక్టరీని జాతీయకరణ చేసి మళ్లీ ప్రభుత్వమే నడపాలన్న రైతు సంఘాల డిమాండ్‌ను జగన్ సర్కార్ ప్రస్తుతం పట్టించుకునే పరిస్థితిలో కనిపించడం లేదు. లచ్చయ్యపేట ఫ్యాక్టరీ, భీమసింగి సహకార చక్కెర ఫ్యాక్టరీలను రెండింటినీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్వహించలేక చేతు లెత్తేసింది. ఫలితంగా చెరకు రైతుల పరిస్థితి ఎప్పటిలాగే దయనీయంగా మారింది.

భూముల వేలం రద్దయింది

లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం భూముల వేలం రద్దయింది. ఈ భూములను దక్కించుకున్న వారు చేసుకున్న రిజిస్ట్రేషన్లు రద్దు అయినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు పార్వతీపురం జిల్లా కలెక్టర్ నుంచి మాకు సమాచారం అందింది.

\- ప్రసాదరావు, సబ్ రిజిస్ట్రార్, బొబ్బిలి

మా పరిధిలో లేదు

ఎన్‌సీఎస్ భూముల వేలం ప్రక్రియ రద్దుకు సంబంధించిన అంశాలు మా పరిధిలో లేవు. అవి పూర్తిగా ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం, ఇతర వ్యవస్థలకు సంబంధించినది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో రైతుల బకాయిల చెల్లింపును పూర్తి చేశాం.

-సత్యనారాయణ, డిప్యూటీ కేన్ కమిషనర్, బొబ్బిలి

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



విజయనగరం రూరల్, జనవరి 23: నగరంలో మంగళవారం హనుమాత్ లక్ష్మణ సీతారాముల శోభాయాత్ర వైభవంగా జరిగింది. రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీమద్రాపారాయణ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసా సేవా సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వ హించారు. హనుమాత్ లక్ష్మణ సీతారాముల విగ్రహాలను ప్రత్యేక రథంపై నిలిపి మూడులాంతర్ల వద్ద ఉన్న పైడిమాంబ ఆలయం నుంచి రింగురోడ్డులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకూ మంగళవాద్యాలు, కోలాటంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. టీటీడీ ద్రవిడ పండితులు జి.జగన్నాథాచార్యులు, వేద పండి తులు, వైష్ణవస్వాములు, వేద పారాయణాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు జి.శివకుమార్, జి.శ్రీనివాసరావు, బి.సూర్యలక్ష్మి, ఎ.రమణ, చంద్రిక, వికాసతరంగిణి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: మాట్లాడుతున్న కిమిడి నాగార్జున



రాజాం: కొండ్రు మురళీమోహన్‌కు హారతులిస్తున్న మహిళలు



శృంగవరపుకోట: మాట్లాడుతున్న తుపాకుల అప్పారావు

చంద్రబాబుతోనే సుపరిపాలన

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, జయహో బీసీ కార్యక్రమంలో ప్రభుత్వంపై టీడీపీ నాయకుల ధ్వజం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ,జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను వివరించారు. ప్రజలకు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేశారు.

● **విజయనగరం రూరల్:** బీసీలను జగన్మోహన్‌రెడ్డి నమ్మించి నట్టేట ముంచారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆరోపించారు. మంగళవారం విజయనగరంలో నియోజకవర్గస్థాయి జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుత బీసీలకు అనాడు ఉన్న వైభవాన్ని సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని ఆరోపించారు.తన సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చి, బీసీ సామాజిక వర్గానికి ఎటువంటి ప్రాధాన్యత లేకుండా చేశారన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పదవులు ఇచ్చారని, ఆ పదవులవల్ల బీసీలకు ఒరిగే ప్రయోజనం ఏదీ లేదన్నారు. టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు మాట్లాడుతూ బీసీల సంక్షేమం టీడీపీ హయాంలోనే ఎక్కువ జరిగిందన్నారు. మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ హయాంలో బీసీ సంక్షేమం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు.టీడీపీ తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర కన్వీనర్ కంది మురళీనాయుడు మాట్లాడుతూ టీడీపీ బీసీ పక్షపాతన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, టీడీపీ బీసీ నాయకులు కర్రోతు బంగార్రాజు, కనకల మురళీమోహన్, కొండ్రు శ్రీనివాసరావు, ముద్దాడ చంద్రశేఖర్, కర్రోతు నర్సింగరావు, పాండ్రంకి గౌరీనాయుడు,దేవేంద్రనాథ్, పైడిరాజు, గంటా రవి, బోనికుమార్, అనురాధ బేగం, కొర్నాన రాజ్యలక్ష్మి, బెవర భరత్ పాల్గొన్నారు.

● **రామభద్రపురం:** చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు తెలిపారు. నర్సాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **లక్కవరపుకోట:** వైసీపీఅధినేత జగన్మోహన్‌రెడ్డికి ఈ రాష్ట్రాన్ని పాలించే అవకాశం ఇంకా 25 రోజులు మాత్రమే మిగిలి ఉందని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. లక్కవరపుకోటలో పార్టీ మండలాధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మరో 25 రోజుల్లో మంచి రోజులు రాబోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ, కొట్యాడ ఈశ్వరరావు, కల్లద్దాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● **రాజాం:** వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొండ్రు మురళీమోహన్ ఆరోపించారు పురపాలక సంఘం పరిధిలోని పొనుగుటివలసలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రెండు లక్షల 30 వేలఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, జీటీనాయుడు, శాసపు రాజేష్‌కుమార్,నాగరాజు, టంకాల కన్నంనాయుడు పాల్గొన్నారు.

● **రేగిడి:** వైసీపీ ప్రభుత్వం ప్రజలు విశ్వాసం పూర్తిగా కోల్పోయిందని, రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తారని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం తెలిపారు. మంగళవారం మండలంలో దేవుదళ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ జగన్ సర్కారు వరుస వైఫల్యాలు, విధ్వంసపాలనతో రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన ప్రభుత్వం రావడం ఖాయమన్నారు.

●**శృంగవరపుకోట:** బీసీలను అభివృద్ధిపథంలో నడిపించినది టీడీపీయేనని ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ దాసరి సాధికార సమితి కన్వీనర్ తుపాకుల అప్పారావు తెలిపారు. శృంగవరపుకోటలో జయహో బీసీ దాసరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి సాధికార సమితి డైరెక్టర్ పడాల రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, పొట్నూరు రత్నాజీ, వసంత సత్యారావు, సరిపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.



రామభద్రపురం: నర్సాపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

● **వేపాడ:** బీసీల అభ్యున్నతికి పనిచేసినది టీడీపీయేనని ఆ పార్టీ ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి తెలిపారు. పాటూరులో టీడీపీ బీసీసెల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీ, ఎస్టీ, ఎస్సీలను కేవలం ఓట్ల కోసం ఉపయోగించుకుం టోందని ఆరోపించారు. గతంలో ప్రభుత్వాలు బీసీలు, ఎస్సీల, స్త్రీల సంక్షే మానికి ప్రవేశాపెట్టిన పలు పథకాలను రద్దుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి చంద్రబాబు ఎన్ని పథకాలు అమలు చేశారన్నారు. కార్య క్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి,మండల ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, నాయకులు గుంటపల్లి దేముడుబాబు, గోకాడ నాగభూషణం, బోజంకి మహేష్,రంది మహేశ్వరరావు, జాగరపు రాము,జాగరపు దేముడు,గోకాడ సత్యం,జాగరపు బంగారునాయుడు,రావాడ రాము పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ విస్తరణాధికారి దుర్మరణం



సత్యనారాయణ (ఫైల్)

రాజాం రూరల్/వంగర: పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న వ్యవసాయశాఖ విస్తరణాధికారి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో దుర్మరణం పాలయ్యాడు. రాజాం పోలీసుల కథనం మేరకు..వంగర మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ వ్యవసాయ శాఖలో విస్తరణాధికారిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం రాజాంలోని బొబ్బిలిరోడ్డులో మార్కెట్‌యార్డులో వ్యవసాయశాఖ కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. ఈ రోడ్డులో ఎస్సీ కాలనీ సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు సత్యనారాయణ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.సత్యనారాయణకు భార్య ఇందిరతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇందిర వంగర మండలంలోని మద్దివలస పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఈ మేరకు రాజాం పోలీసులు కేసు నమోదుచేశారు.

విద్యుదాఘాతంతో జేఎల్ఎం మృతి

నెల్లిమర్ల: గుషిణిలో విధుల్లో ఉన్న జూనియర్ లైన్‌మ్యాన్(జేఎల్ఎం) రెడ్డి కోటరావు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసులు, సహచర ఉద్యోగుల కథనంమేరకు.. జామి గ్రామానికి చెందిన రెడ్డికోటరావు గుషిణిలో జేఎల్ఎంగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో గ్రామ పరిధిలోని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌కు లైన్ ఇచ్చేందుకు స్తంభం ఎక్కి పని చేస్తున్నాడు. 11 కేవీ విద్యుత్ లైన్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై, కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గుషిణిలో విషాదం నెలకొంది. కోటరావు మృతితో గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ పిచ్చయ్యతో పాటు అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గిజబలో ఒకరి ఆత్మహత్య

గరుగుబిల్లి: గడ్డి మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గిజబ గ్రామానికి చెందిన మరడాన తవిటినాయుడు(50) నిత్యం మద్యం తాగితే ఎలా అని భార్య ప్రశ్నించడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో మంగళవారం వేకువజామున ఇంటిలో పంటకు వినియోగించగా మిగిలిఉన్న గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.ఈమేరకు హెచ్‌సీ ఎస్.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

బాలిక కిడ్నాప్.. నిందితుడిపై పోక్సో కేసు

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామానికి చెందిన బొద్దల సాయి అలియాస్ శ్రీనివాస్ (22) ఓ బాలికను కిడ్నాప్ చేసి, అనంతరం బలవంతం చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆంధ్ర పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు.గజపతినగరం సీఐ ప్రభాకర్ కథనం మేరకు..బొద్దల సాయి ఓ బాలికతో చనువుగా ఉండేవాడు. కొద్దిరోజుల కిందట బాలికకు మాయ మాటలు చెప్పికిడ్నాప్ చేశాడు.అనంతరం బలవంతం చేశాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సోకేసు నమోదుచేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ దర్యాప్తు చేస్తున్నారు.

200 లీటర్ల బెల్లం ఊట స్వాధీనం

రామభద్రపురం: ఆరికతోట శివారులో 200 లీటర్ల బెల్లంఊట స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. సారా తయారు చేయడానికి సిద్ధంచేసి భూమిలో పాతిపెట్టిన బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దాడుల్లో హెచ్‌సీ నారాయణరావు, కానిస్టేబుళ్లు మట్టయ్య, నారాయణరావు పాల్గొన్నారు.

ఖైదీలకు మానసికోల్లాసం

బొబ్బిలి: ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు పలు కళా, సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించ నున్నట్లు బొబ్బిలి సబ్ జైలు సూపరింటెండెంట్ జీఎస్ఆర్ పాత్రో తెలిపారు. ఈ మేరకు స్థానిక సబ్‌జైలులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకుబేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ఆనందో బ్రహ్మ కళాసంస్థ ప్రతినిధి మింది విజయ మోహనరావు తదితర ప్రతినిధులను సబ్‌జైలుకు ఆహ్వానించారు. ఖైదీలకు ఉత్తేజం కలిగించే ఉపన్యాసాలు, పాటలు, గేయాలు, ఇతర కళా ప్రదర్శనలతో వారిలో పరివర్తన తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. నెలకు రెండు కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పాత్రో వివరించారు.

చదరంగం పోటీలకు ఎంపిక

విజయనగరం రూరల్: తిరుచురాపల్లి భారతీదాసన్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 29 వరకూ జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ చదరంగం పోటీలకు వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో పి.రాకేష్ టి.గణేష్ కుమార్, ఎస్.చరణ్, కె.సతీష్‌కుమార్, డి.శామ్యూల్ ఉన్నారు. వీరిని జేఎన్‌టీయూ వీసీ వెంకట సుబ్బయ్య రిజిస్ట్రార్ జి.జయసుమ, స్పోర్ట్సు కోఆర్డినేటర్ ఏవీ పాపారావు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రామభద్రపురం: ఆరికతోటలో ఉన్న పోలింగ్ కేంద్రాలను బొబ్బిలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుమలరావు పరిశీలించారు. మంగళవారం ఆయన జడ్పీ హైస్కూల్‌లో ఉన్న కేంద్రాలను పరిశీలించి విద్యుత్ సౌకర్యం, ప్రహరీ తదితర వాటిపై అధికారులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం సర్పంచ్ పెంకి పుష్పమ్మ,మాజీ సర్పంచ్ భీమయ్యలతో మాట్లాడి రానున్న అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో ఎటువంటి వివాదాలు లేకుండా ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలి

● బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పారావు

శృంగవరపుకోట రూరల్: చిట్టంపాడులో గతంలో తల్లీబిడ్డ అనారోగ్యంతో చనిపోవడం, ఇదిజరిగిన రోజుల వ్యవధిలో మరో చిన్నారి చనిపోవడం బాధాకరమని, ఇటువంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా వైద్యశాఖ అప్రమత్తంగా ఉండకపోతే సహించేదిలేదని బాలలహక్కుల చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. మంగళవారం చిట్టంపాడు గిరిశిఖర గ్రామంలో కేసలిఅప్పారావు అధికారులతో పర్యటించారు. స్పెషల్‌డిప్యూటీకలెక్టర్ సుదర్శనదొర ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన మరణాలపై ఆయా కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం వైద్య తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. గిరిశిఖర ప్రాంతంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేయాలని, తాగునీరు శ్యాంపిళ్లు తీసి ల్యాబ్‌కు పంపించి నీరు సురక్షితమో కాదో తెలుసుకోవాలని కోరారు. బుధవారం కలెక్టర్‌తో జరిగే సమావేశంలో జిల్లాలో గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేసేవరకు ఫీడర్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని,విశాఖ కేజీహెచ్‌లో గిరిజనులకు ఉచితంగా మందులు, వైద్యపరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని, గిరిజన గర్భిణులకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటుచేయాలని కోరుతామని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు,కార్యదర్శి బంగారు నాయుడు పాల్గొన్నారు. కాగా అధికార బృందంతో చిట్టం పాడ వెళ్తున్న మలేరియాఅధికారి శ్రీనివాసరావు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పిగాయపడ్డారు.ఆయన్ను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.



గిరిజనులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

550 మందికి నేత్ర వైద్య పరీక్షలు



దేవుదళలో కళ్లజోళ్లు పంపిణీచేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని దేవుదళలో మంగళవారం సంకిలి ఇఐడీ ప్యారీ సుగర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో 550 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలుచేసి కళ్లజోళ్లు, మందులు పంపిణీచేశారు. విజయవాడ మెడాల్ ఐకేర్ ఆసుపత్రి వైద్యులు ఎస్.కృష్ణమూర్తి, డాక్టర్ అనీల్‌కుమార్ వైద్య పరీక్షలుచేశారు.కార్యక్రమంలో సుగర్స్ ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, హెచ్ఆర్ హెడ్ మురళీకృష్ణ, సుగర్ కేన్ డీజీఎం రాజేంద్ర, ఎలక్ట్రికల్ డీజీఎం డి.రామకృష్ణ,ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.శ్రీహరి, దేవుదళ కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మి,గవరయ్య పాల్గొన్నారు.●**వేపాడ:** మండలంలోని బల్లంకిలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి, రాజులు ఆధ్వర్యంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యశిబిరాన్ని ఎంపీడీవో సందర్శించారు.

రెండు పూటలూ పనిచేయాలి: ఏపీవో

రేగిడి: ఉపాధి వేతనదారులు రెండు పూటలు కొలతల ప్రాప్తికి పనిచేస్తే రూ. 272లు వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీవో హరనాథ్ సూచించారు. మంగళవారం లచ్చురాయపురంలో బందచెరువు పనులనుతనిఖీచేశారు.ఆయన వెంట ఎఫ్ఏ వెంకటరమణ, మేట్లు ఉన్నారు.



రామభద్రపురం: మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో

●**రామభద్రపురం:** ఉపాధి హామీ పథకం కూలీలు రెండు పూటలా పని చేయాలని ఏపీవో జి.త్రినాథరావు సూచించారు. కొట్టక్కిలో జరుగుతున్న ఉపాధి పథకం పనులను పరిశీలించారు. రూ.9.81లక్షల అంచనాలతో మండలవాని చెరువు పూడికతీత పనులు జరుగుతున్నాయి. అనంతరం మస్టర్లు, రికార్డులు పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచనలు అందించారు.

భోజనం రుచిగా ఉండాలి: ఎంఈవో

రేగిడి: పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం రుచి కరంగా ఉండాలని ఎంఈవో వరప్రసాదరావు కోరారు. మంగళవారం దేవుదళ ప్రాథమికపాఠశాలను పరిశీలించారు. భోజనం నిర్వహణ, పిల్లల అభ్యసనా సామర్థ్యం హెచ్ఎం మారుతీప్రకాశ్‌కు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట సీఆర్పీ చంద్రరావు ఉన్నారు.

కులగణన ప్రక్రియ పూర్తి చేయండి: డీఎల్‌పీవో

జామి: మండలంలో కులగణన ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని డీఎల్‌పీవో నిర్మలాదేవి ఆదేశించారు. మంగళవారం జామిలోని మూడు సచివాలయాల పరిధిలో కులగణనపై ఈవోపీఆర్డీ శ్రీదేవితో చర్చించారు.

నేతాజీ అడుగుజాడల్లో నడవాలి



తెర్లాం: నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తెర్లాం: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం తెర్లాం శాఖా గ్రంథాలయంలో నేతాజీ జయంతి పురస్కరించుకుని గ్రంథాలయాధికారి సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలోఉపాధ్యాయులు తిరుపతిరావు,కె.కృష్ణవేణి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.●**రాజాం:** రాజాంరెడ్‌క్రాస్ కార్యాల యంలో సుభాష్ చంద్రబోష్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు దాడి మోహన్‌రావు ఎస్.శ్రీనివాసరావు, రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాం త్‌కుమార్, పెంకి చైతన్యకుమార్,శివకృష్ణ, ఉల్లాకుల నీలకం ఠేశ్వరయాదవ్, వంజరాపు రాము పాల్గొన్నారు. ● సంతకవిటి మండలంలోని బొద్దూరు ఉన్నతపాఠశాలలో సుభాష్ చంద్రబోష్ చిత్రపటానికి హెచ్ఎం మల్లేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదరరావు, లక్ష్మీభాను, సత్యానారాయణ, ప్రసాద్ కృష్ణ, పురుషోత్తం, భవానిపాల్గొన్నారు. ●**బొబ్బిలి:** బొబ్బిలిలో న్యాయవాది తుమరాడ గంగాధర్ ఆధ్వర్యంలో నేతాజీకి నివాళులర్పించారు. కార్య క్రమంలో పీఆర్‌టీయూ నాయకులు చింతాడ అప్పారావు, రవి, సురేష్, కె.అశోక్ పాల్గొన్నారు.

బొబ్బిలి యుద్ధానికి 226 ఏళ్లు

బొబ్బిలి: బొబ్బిలి యుద్ధం జరిగి బుధవారానికి 226 ఏళ్లు పూర్తవుతాయి. ఈ యుద్ధం విజయనగరం-బొబ్బిలి రాజుల మధ్య 1757 జనవరి 24న జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యుద్ధ స్మారకస్థూపం, తాండ్ర పాపారాయుడు, దివంగత బొబ్బిలి రాజా విగ్రహాలకు, వీరసైనికులకు బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాజవంశీయుడైన ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) నివాళులర్పిస్తారు.

గాజులతో పైడిమాంబకు అలంకరణ

విజయనగరంరూరల్: విజయనగరంలోని పైడిమాంబకుమంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాతసేవ అనంతరం సాధారణ భక్తులకు దర్శనం కల్పించారు. నగరంలోని పలుప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు.

అంగన్‌వాడీల విజయోత్సవ సభ



బొబ్బిలి: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శంకరరావు

విజయనగరం దాసన్నపేట: అంగన్‌వాడీ ఉద్యోగులు, హెల్పర్ల సమ్మె విజయవంతంచేసిన కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆ సంఘ అధ్యక్షురాలు బి.పైడిరాజు చెప్పారు. మంగళవారం విజయనగరంలోని కలెక్టరేట్ వద్ద ఉన్న శిబిరం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, అంగన్‌వాడీ విజయనగరం అర్బన్ ప్రాజెక్టు సెక్టార్ నాయకులు అభివాదం తెలిపారు. యూనియన్ నాయకురాలు పైడిరాజు మాట్లాడుతూ 42 రోజులుగా సమ్మెలో ఉన్న తమకు మద్దతుగా నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.సమస్యలపై పోరాడిన అంగన్‌వాడీలను కార్మిక సంఘాల నాయకులు ఎం.శ్రీనివాస, రెడ్డి శంకరరావు, రెడ్డి నారాయణరావు, వెంకటరావు, బి.రమణ, సుధారాణి, జగన్మోహన్‌రావు అభినందించారు.

● **బొబ్బిలి:** ప్రభుత్వం అనేక రకాలుగా బెదిరింపులకు పాల్పడినా మొక్కవోని దీక్షతో అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేశారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు తెలిపారు. బొబ్బిలి ఎన్టీఆర్ కూడలిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెకు టీడీపీ, జనసేన, కాంగ్రెస్, వామపక్ష కార్మిక, ఉపాధ్యాయ సంఘాలు, మీడియా వెన్నుదన్నుగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.కామేశ్వరి, రోజా, శ్రీదేవి పాల్గొన్నారు.

●**కొత్తవలస:** పోరాటాలుచేస్తే ఎటువంటి సమస్యలనైనా పరిష్కరించుకో వచ్చని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు గాడి అప్పారావు, సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ అన్నారు. 42 రోజుల పాటు సమ్మె చేసి విజయం సాధించిన సందర్భంగా కొత్తవలసలో విజయోత్సవ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు నిర్వహించారు.

'రాబోయేవి మంచి రోజులు'

కొత్తవలస : రాబోయేవన్నీ మంచి రోజులేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి కొత్తవలస జంక్షన్‌లో సీతారాముల వారి తీర్థం పురస్కరించుకుని టీడీపీ మండలాధ్యక్షుడు గొరపల్లి రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. త్వరలో రాష్ట్రం నుంచి దుష్టపాలన పోతుందని, తెలుగుదేశం, జనసేన ఆధ్వర్యంలో సుపరిపాలన రాబోతుందని చెప్పారు.ప్రజల కష్టాలన్నీ తొలగిపోనున్నాయని చెప్పారు.


ఒంటికాలిపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తవలస: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఏపీ టైటిలింగ్ చట్టానికి వ్యతిరేకంగా మంగళవారం కొత్తవలస కోర్టు వద్ద న్యాయవాదులు ఒంటి కాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాద సంఘ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్. గిరిబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాద సంఘాల పిలుపు మేరకు తమ నిరసన కార్యక్రమాలను ఈనెల 24 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 25న మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించి స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ వరకు కోర్టు విధులకు దూరంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్ రామచంద్ర ప్రసాద్, ఎంవీఎస్ గిరిబాబు, ఒ.వి.మురళీకృష్ణ, జీవీ రమణ, డి.శ్రీనివాస్, నందిపల్లి శ్రీరామమూర్తి, ఎస్.శ్రీరామమూర్తి, కె.అచ్చిబాబు, ఎం.కృష్ణమూర్తి, నాగేంద్ర, వైజీ నాయుడు, జి.పుష్పలత, కనకారావు పాల్గొన్నారు.

శంబరలో వైద్య శిబిరాల పరిశీలన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జగన్మోహనరావు

మక్కువ: శంబర పోలమాంబ జాతర సందర్భంగా చదురుగుడి వెనుక ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు మంగళవారం పరిశీలించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నం దున వైద్యం కోసం వచ్చే రోగులకు తక్షణ వైద్య సహాయం అందించాలని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఏ విధంగా వైద్యసేవలు అందిస్తు న్నారనే విషయంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రఘుకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

రాజాం: నియోజకవర్గ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో మండలం నుంచి పది టీములు పాల్గొనున్నాయని, అయితే రాజాం రూరల్, అర్బన్ పరిధిలోని తొమ్మిది టీములు మాత్రమే పోటీల్లో పాల్గొంటాయని బాలికల క్రికెట్ జట్టు లేకపోవడంతో తొమ్మిది జట్లు తలపడతాయని పేర్కొన్నారు. పోటీలు నిర్వహించడానికి రాజాం జీసీఎస్ఆర్ కళాశాల మైదానం సిద్ధంచేశామని తెలిపారు.● **బొబ్బిలి:** స్థానిక గురుకుల పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహించనున్నారు. బొబ్బిలి ఆర్డీవో ఎ.సాయిశ్రీ మంగళవారం ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డీ అల్లు భాస్కరరావు, గురుకుల ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. కాగా ఇక్కడ మంగళవారం జరిగిన మండల స్థాయి ఆటల ముగింపు కార్య క్రమంలో శంబంగి వేణుగోపాలనాయుడు, మునిసిపల్ కమిషనరు సత్తారు శ్రీనివాసరావు, పీడీ నల్ల వెంకటనాయుడు పాల్గొన్నారు.

6న చలో విజయనగరం

విజయనగరం రూరల్: జిల్లాలో ఒక్క స్థానానైనా యాదవులకుకేటాయించాలని యాదవ్ స్టూడెంట్ విభాగం నాయకుడు బీసపు సాయియాదవ్ కోరారు. మంగళవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ యాదవుకు అసెంబ్లీ సీటు కేటాయించాలని కోరుతూ వచ్చే నెల ఆరో తేదీన చలో విజయనగరం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయనగరంతోపాటు, అన్ని నియోజకవర్గాల్లో యాదవ ఓట్లు అధికంగా ఉన్నాయని తెలిపారు.

ఆర్థిక సంఘ నిధులు విడుదల

రామభద్రపురం: మండలంలోని 22 పంచాయతీల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థికసంఘం కింద కోటి రూపాయలు విడుదలయ్యాయని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రమామణి, ఈవోపీఆర్డీ వెంకటరమణలతో ఎంపీపీతో సమావేశమయ్యారు.

4,04,031 మందికి ఆసరా

కలెక్టరేట్: జిల్లాలోని 4,04,031మంది మహిళా సంఘ సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా పథకం కింద సీఎం జగన్ రూ 252.31 కోట్లు జమచేశారని జేసీ మయూర్ అశోక్ తెలిపారు.మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన కార్యక్రమంలో నాలుగోవిడత కింద జిల్లాలోని 36,507 సంఘాలకు నిధులను విడుదలచేశారు. ఈ సందర్భంగాప్రత్యక్షప్రసారం అనంతరం ఈమొత్తాన్ని చెక్కును మహిళా సంఘాల సభ్యులకు కలెక్టరేట్ వీసీ హాలులో అందజేశారు.కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, ఎమ్మెల్సీ సురేష్ బాబు, ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి ,మెప్మా పీడీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

షర్మిల దృష్టికి బొబ్బిలి సమస్యలు

బొబ్బిలి: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల దృష్టికి బొబ్బిలి ప్రాంత సమస్యలను తీసుకెళ్లామని పీసీసీ సభ్యుడు మువ్వల శ్రీనివాసరావు,ముగడ వెంకటరమణ తెలిపారు. మంగళవారం విజయనగరం పర్యటనకు వచ్చిన షర్మిలతో పాటుకాంగ్రెస్ నేతలకు చెరకు, జ్యూట్, గ్రోత్‌సెంటర్‌లోని పరిశ్రమలు మూతపడడంతో కార్మికులు ఉపాధి కోల్పోవడం, కూలీలు, సన్నకారు రైతు కుటుంబాల వలస బాట పట్టడం, రోడ్లు, సాగు, తాగునీటి సమస్యలు వివరించామని తెలిపారు. సమస్యలపైనా పోరాటాలు సాగించాలని దిశానిర్దేశం చేసినట్లు వారు తెలియజేశారని చెప్పారు.

రూ.22 కోట్ల రుణాలు: ఏపీఎం

రామభద్రపురం: మండలంలో ఈఏడాది బ్యాంకు లింకేజీ కింద రూ.22 కోట్ల 65 లక్షలు రుణాలు అందించామని వెలుగు ఏపీఎం ఎ.రత్నప్రసాద్ తెలిపారు. దీని కోసం 530 సంఘాలను ఎంపికచేశామన్నారు. ఈ ఏడాది రూ27 కోట్ల 80 లక్షలు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆసరాకింద నాలుగో విడత 990 సంఘాలకు రూ.5 కోట్ల 2లక్షల 54 వేలు అందించామని చెప్పారు. స్త్రీనిధి పథకం కింద 505 మంది సభ్యులకు రూ.4 కోట్ల 49 లక్షలు అందించామన్నారు. ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో 20యూనిట్లు నెలకొల్పి రూ.40 లక్షలు బ్యాంకు రుణాలు అందించామన్నారు. సున్నావడ్డీ ద్వారా 1,179 సంఘాలకు రూ.కోటి27లక్షల 89 వేలు అకౌంట్‌లో జమ చేశామన్నారు.

ముఖ్యకార్యదర్శిని కలిసిన రఘురాజు

శృంగవరపుకోట: ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం సీఎంవో ముఖ్యకార్యదర్శి ధనంజయ రెడ్డి, ఐ-ప్యాక్ ప్రతినిధులను కలిశారు.ఏడాది కాలంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో ఎమ్మెల్సీ రఘురాజు విభేదిస్తున్న సంగతి తెలిసిందే

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను విజయనగరం జిల్లాలో మంగళవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పార్టీ కార్యాలయాల వద్ద, నాయకుల ఇళ్ల వద్ద కేక్ కట్‌చేసి, అందరికీ పంచిపెట్టారు. అలాగే పలుచోట్ల పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు.
(ఆంధ్రజ్యోతి బృందం)


నెల్లిమర్ల: వేడుకల్లో బంగార్రాజు, రవిశేఖర్, తదితరులు


ఎస్.కోట: అన్నక్యాంటీన్ వద్ద కేక్ కట్ చేస్తున్న కోళ్ల లలితకుమారి


రాజాం: కోండ్రుకు కేక్ తినిపిస్తున్న నంది సూర్యప్రకాష్‌రావు


శృంగవరపుకోట: ఎస్.కోటలో కేక్ కట్ చేస్తున్న గొంప కృష్ణ

సోలార్ విద్యుత్‌తో బిల్లులు ఆదా

● ఎన్ఆర్ఈడీసీఏపీ జిల్లా మేనేజర్ ఎంవీకే రాజు


సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న రాజు

కొత్తవలస: కొత్తవలస కోర్టుకు ఇకపై చాలా తక్కువ మొత్తంలో కరెంట్ బిల్లులు వస్తాయని న్యూ అండ్ రెన్యూబల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌ఈడీసీఏపీ) జిల్లా మేనేజర్ ఎంవీకే రాజు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీని వినియోగం, నిర్వహణ వంటి అంశాలను రాజు మెజిస్ట్రేట్ విజయచందర్‌కు వివరించారు. సుమారు రూ.20 లక్షలతో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశామన్నారు. వీటితో 15 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ కనెక్షన్‌కు సోలార్ విద్యుత్‌ను అనుసంధానం చేశామన్నారు. దీని వల్ల సాధారణ విద్యుత్ వాడకం తగ్గి పోతుందని, చార్జీలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని వివరించారు. సోలార్ విద్యుత్ వాడకం వల్ల మిగులు విద్యుత్‌ను విద్యుత్‌శాఖే తీసుకుంటుందని... అందుకు తిరిగి డబ్బు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్ రామచంద్ర ప్రసాద్, కె.మహేశ్వరరావు, ఓపీ మురళీకృష్ణ, డీవీఎల్ దేవి, జీవీ రమణ, ఎం.కృష్ణమూర్తి, డి.శ్రీనివాస్, నందిపల్లి శ్రీరామమూర్తి, ఎన్.శ్రీరామమూర్తి, కె.అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలంటే ఇంత అలుసా?

● టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర


రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలిస్తున్న విజయచంద్ర

బెలగాం: టీడీపీ యువనేత నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేసేందుకు పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయ చంద్ర మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈసందర్భంగా రోగులకు మెరుగైన వైద్యం అందుతుందా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా అని అడిగారు. రోగులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. రెండు రకాల నాణ్యతగల అన్నాన్ని గమనించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా రెండు రకాలుగా ఎందుకు వండారని ప్రశ్నించారు. రేషన్ బియ్యంతో వండిన అన్నాన్ని సామాన్య రోగులకు అందిస్తున్నామని, కొంచెం నాణ్యతగల ఆహారాన్ని ఆరోగ్యశ్రీ రోగులకు అందిస్తామని సూపర్‌వైజర్ తెలిపారు. దీనిపై విజయచంద్ర స్పందిస్తూ పేదలంటే అంతా అలుసా.. అందరికీ నాణ్యమైన భోజనం అందించాలి కదా అని అన్నారు.

ప్రాథమిక చికిత్సపై గిరిజన యువతకు శిక్షణ

బెలగాం: జన విజ్ఞాన, పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన యువతకు ప్రాథమిక చికిత్సపై శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక గిరిజన భవన్‌లో మంగళవారం నిర్వహించిన శిక్షణలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సాలూరు, పార్వతీపురం, కొమరాడ, సీతంపేట మండలాలకు చెందిన 30 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. పాముకాటు, వడదెబ్బ, విద్యుదాఘాతం ఏర్పడిన సమయాల్లో ఏ విధంగా ప్రాథమిక చికిత్స అందించాలి అనేదానిపై జన విజ్ఞాన వేదిక నాయకులు సుజాత, యోహాను, ప్రాణిగ్రాహి శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ జిల్లా అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ, డీఏవో ధనలక్ష్మి ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పాలక రంజిత్‌కుమార్, డి.చంద్రమౌళి, కె.చిన్నారావు పాల్గొన్నారు.

ఆసరా నిధులు విడుదల

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ద్వారా జిల్లాలో నాలుగు విడతల్లో రూ.378.39 కోట్లు నిధులు విడుదల చేసినట్టు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్వయం సహాయక పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధులను విడుదల చేశారు. జిల్లాలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి కలెక్టర్ నిశాంత్‌కుమార్.. స్వయం సహాయక సంఘాలకు 94.33 కోట్లు రూపాయలు ఆసరా నిధులు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడతలో జిల్లాలో 16,669 స్వయం సహాయ పొదుపు సంఘాలకు చెందిన 1,83,077 మంది సభ్యులు బ్యాంకు ఖాతాలలో రూ.94.33 కోట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా జమచేసినట్టు తెలిపారు. ఈ పథకం కింద జిల్లాకు నాలుగు విడతల్లో రూ.378.39 కోట్లు నిధులు విడుదల చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డీఆర్‌డీఏ పథక సంచాలకులు పి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

● **చీపురుపల్లి:** వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత కింద మండలంలోని 1347 మహిళా సంఘాలకు రూ.11.55 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వైసీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్ర వెలుగు ఏపీఎం ఎంవీ రాజశేఖర్, సీసీలు, వీవోఏ లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


అగ్ని అస్త్రం తయారు చేస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస: ప్రకృతి వ్యవసాయ సాగు లాభదాయకమని జిల్లా ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. మంగళవారం కన్నపుదొరవలస గ్రామంలో జొన్న పంట వేసిన రైతులకు సామూహిక అగ్నాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఈ కషాయం తయారు చేసుకుని వాడుకోవడం వల్ల జొన్న పంటలో ఖర్చు తగ్గించుకుని, దిగుబడులు పెరగడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వై.కృష్ణ, ఎం.మోహనదాస్, రైతులు సీహెచ్ అప్పలనాయుడు, స్వామినాయుడు, సన్యాసినాయుడు, పద్మ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

డెంకాడ: జొన్నాడ వద్దగల లెండి ఇంజినీరింగ్ కళా శాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి తరగతుల్లో భాగంగా యూత్ 2 లేడ్, మిషన్ 45 డేస్ అనే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజినీర్ డా.విశ్వజిత్ చౌబే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉండాలన్నారు. అనంతరం కళాశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన కొత్త ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.మధుసూధనరావు, సెక్రటరీ శివరామకృష్ణ, పాలక మండలి సభ్యుడు పి.రాజీవ్, ప్రిన్స్‌పాల్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్స్‌పాల్ టి.హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొప్పల వెలమలకు టికెట్ కేటాయించాలి

గంట్యాడ: గజపతినగరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టికెట్టు కొప్పలవెలమ సామాజిక వర్గానికి కేటాయించాలని పార్టీ నియోజకవర్గ నాయకులు మంగళవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును కోరారు. నియోజకవర్గానికి చెందిన సుమారు 20 మంది పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు కలిసి అచ్చెన్నాయుడు స్వగ్రామమైన నిమ్మాడ వెళ్లారు. ఇటీవల నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారని.. అందులో బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన తెంటు లక్ష్మునాయుడు పేరు వచ్చిందని తెలిపారు. ఒకవేళ నియోజకవర్గంలో కొప్పలవెలమ సామాజిక వర్గానికి టిక్కెట్ కేటాయిస్తే బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా గజపతినగరం నియోజకవర్గంలో ఉన్న వారికి ఇవ్వాలని కోరారు. రామవరానికి చెందిన అల్లు విజయకుమార్, మదనాపురానికి చెందిన రంధి చినరామునాయుడు, గంట్యాడ మాజీ జడ్పీటీసీ సభ్యులు కొరుపోలు రమేష్ కుమార్, బొండపల్లి మాజీ జడ్పీటీసీ సభ్యులు బండారు బాలాజీ పేర్లను పరిగణనలోకి తీసుకుని ఎవరైనా ఒకరికి టిక్కెట్ ఇవ్వాలని అచ్చెన్నాయుడును కోరారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ, జామి, బొండపల్లి, దత్తిరాజేరు మండలాలకు చెందిన కొప్పలవెలమ టీడీపీ నాయకులు బొడ్డు రాము, చంద్రశేఖర్, కిలపర్తి పరదేశినాయుడు, గొర్రుపోటు శ్రీనివాసరావు, కొరుపోలు గణపతి, పల్లి వెంకటరావు, పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.


అచ్చెన్నాయుడుతో కొప్పలవెలమ నాయకులు

టీడీపీతోనే బీసీలకు తగిన గుర్తింపు

గరుగుబిల్లి: టీడీపీతోనే వెనుకబడిన తరగతులకు తగిన గుర్తింపు లభించిందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, పార్టీ కురుపాం నియోజక వర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మంగళవారం రావివలస గ్రామంలో బీసీ సాధికార సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలను చిన్న చూపు చూస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకంగా ఉన్నారన్నారు. అనంతరం లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌దేవ్, పార్టీ ప్రతినిధులు కోట భరత్‌కుమార్, అక్కేన మధుసూదనరావు, డొంకాడ రామ కృష్ణ, మర్రాపు పురుషోత్తంనాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, అంబటి తవిటినాయుడు, ఆర్నిపల్లి గంగాధర్‌నాయుడు, సీహెచ్ దామోదర్‌నాయుడు, రామకృష్ణ, పాల్గొన్నారు.

● **భామిని:** వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. భామిని మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు ఒరిగింది ఏమీ లేదని, వారికి ఉన్న సంక్షేమ నిధులు కూడా తొలగించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు రవినాయుడు, నిమ్మల నిబ్రం, మేడిబోయిన జగదీష్, భూపతి ఆనందరావు, అంపిలి కేశవరావు, లోపింటి రాజేష్, బిడ్డిక ప్రసాద్, గురుబిల్లి లక్ష్మీపతినాయుడు, కోరాడ రాజేష్, కోరాడ వెంకటరమణ పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై ప్రచారం


చీపురుపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు, అధికారులు

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని మొయిద జంక్షన్‌లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణారావు, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, మేనేజర్ విశ్వేశ్వరరావు, ఆర్ఐ రాజ్యలక్ష్మి, మెప్మా సీఎంఎం డి.గోవిందరావు, ఆర్పీలు పాల్గొన్నారు.

● **చీపురుపల్లి:** వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యకమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఈవో ఝాన్సీ, శానిటరీ తనిఖీ అధికారి జి.వేణుగోపాల్, బీజేపీ యువ మోర్చా ప్రతినిధి మన్నెపురి శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

4జీ టవర్లు సిద్ధం చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

జియ్యమ్మవలస: ఏజెన్సీ ప్రాంతాల్లో మంజూరైన 4జీ టవర్లను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. పీటీ మండ పంచాయతీ కేంద్రంలో మంజూరైన ఎయిర్‌టెల్ 4జీ టవర్ ఏర్పాటు స్థలాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈనెల 25న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా టవర్లను ప్రారంభించనున్నారని చెప్పారు. ఇలోగా టవర్ సిద్ధం కావాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వై.సత్యంనాయుడు, ఏపీఎం ఎం.నాగభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ భవనాల ప్రారంభం

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి గురువారం ప్రారంభిస్తారని మండల ఇంజినీరింగ్ అధికారి గోపి గౌరీశంకరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సంతోషపురంలో ఆర్బీకే, సచివాలయ భవనం, ఉద్దవోలులో సచివాలయ భవనం, ఆర్బీకేతో పాటు వెల్‌నెస్ సెంటర్, పెద్దూరులో ఆర్బీకేని ప్రారంభించనున్నారని చెప్పారు. అదేవిధంగా పలు పంచాయతీల్లో భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు చొరవ



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గరుగుబిల్లి: గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపుతున్నాయని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్‌కుమార్, ఏపీవో ఎం.గౌరీనాథ్, ఏపీఎం పి.అప్పలనాయుడు, సర్పంచ్ కె.ఇందుమతి, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలు తల్లిదండ్రులకు అప్పగింత

మక్కువ: శంబర పోలమాంబ జాతరకు మంగళవారం విచ్చేసిన పలువురి భక్తుల పిల్లలు జనాల రద్దీతో తప్పిపోయారు. పోలీసు వర్గాలకు సమాచారం అందడంతో మక్కువ ఎస్ఐ పి.నరసింహమూర్తి స్పందించారు. పిల్లల నుంచి సమాచారం తెలుసుకుని వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. మొత్తం ఐదుగురు పిల్లలను అప్పగించినట్టు ఆయన చెప్పారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి పండుగ


అమ్మవారి ఘటాన్ని మోస్తున్న సంధ్యారాణి

మక్కువ/సాలూరు: మక్కువ మండలంలో కవిరిపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ఇంటి ఇలవేల్పు శ్రీముత్యాలమ్మతల్లి జాతరలో పండ్లు, కుంకుమలు ఇచ్చి ఘటాలను మోసి అమ్మవారికి మొక్కులు ముడుపులు సమర్పించుకున్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి

సాలూరు: వాహన చోదకులు వాహనానికి సంబంధించిన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను తమ వద్దనే ఉంచుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం శంబర జాతర పరిసరాల్లో ఉన్న రహదారుల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చంద్రబాబుతో రాష్ట్రాభివృద్ధి

గరివిడి: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందని టీడీపీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం గడబవలసలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబుకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్ బాబు, మీసాల సూరప్పడు, గొట్టిముక్కల సత్తిరాజు, దిండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

గంట్యాడ: కొటారుబిల్లి గ్రామ సచివాలయ పరిధిలో నిర్మించిన ప్రభుత్వ భవనాలను స్థానిక శాసన సభ్యులు బొత్స అప్పలనర్సయ్య మంగళవారం ప్రారంభించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ సభ్యులు వర్రి నర్సింహమూర్తి, తహశీల్దార్ నీలకంఠరేశ్వరరెడ్డి, సర్పంచ్ వేమలి రమణమ్మ, ఎస్సీ సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్ కుమార్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న బంటు దాసు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఈనెల 26న ఉదయం 11 గంటలకు స్థానిక బైపాస్ రోడ్డు కాలనీలో ఉన్న రైతు కూలీ సంఘం ఆటోలు, ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్‌కేఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ కన్వీనర్ బంటు దాసు పేర్కొన్నారు. ఈమేరకు రైతు కూలీ సంఘం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దాస్ మాట్లాడుతూ ఆల్ ఇండియా ఎస్‌కేఎం పిలుపు మేరకు ఈ ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. పంటలన్నింటికీ గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, రైతులందరికీ పూర్తి రుణమాఫీలు చేయాలని, రైతులకు, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు వద్దని తదితర సమస్యలపై ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, టి.జీవన్, సీఐటీయూ జిల్లా కోశాధికారి వెంకటరమణ, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.భాస్కరరావు, విశ్వేశ్వరరావు, ఈవీ నాయుడు, గురుగుబిల్లి సూరయ్య, జనసేన పార్టీ నాయకులు బోను చంటి తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి


మాట్లాడుతున్న దమయంతినాయుడు

సీతంపేట: అంగన్‌వాడీలపై పెట్టిన కేసులు ప్రభుత్వం రద్దు చేయాలని టీడీపీ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు బిడ్డిక దమయంతి నాయుడు, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సవర మాలయ్య కోరారు. సీతంపేటలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు టీడీపీ నైతిక మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, పార్టీ ప్రతినిధులు సవర మాలయ్య, ప్రసాదరావు, లక్మయ్య, అజయ్‌కుమార్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణకు విజయచంద్ర పరామర్శ

పార్వతీపురం రూరల్: మండలంలోని పిన్నింటి రామినాయుడువలస గ్రామంలో టీడీపీ నాయకుడు పిన్నింటి వెంకటరమణ తల్లి అమ్మడమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు ఆయన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవి చంద్రమౌళితో పాటు పార్టీ నాయకులు శ్యామలనాయుడు, అక్కినేని శివరెడ్డి, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన తమ్మినాయుడు



పూసపాటిరేగ: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు తనయుడు పతివాడ తమ్మి నాయుడు మంగళవారం ఆయన స్వగృహం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో కలిశారు. ఇటీవల తమ్మినాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈనేపథ్యంలో ఆయన అచ్చెన్నను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు, మండల నాయకులు కొత్తకోట బాలకృష్ణ, పిళ్లా లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన


వంటలను రుచి చూస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషనర్

దత్తిరాజేరు: ఇంగిలాపల్లి యూపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషనర్ బి.కాంతారావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. శుభ్రమైన వాతావరణంలో రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం భోజన పథకం నిర్వాహకుల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

నెల్లిమర్ల: గుర్ల మండలం కెల్ల గ్రామంలో మంగళవారం జరిపిన దాడుల్లో ఓ వ్యక్తి వద్ద నుంచి 100 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ నెల్లిమర్ల సీఐ పి.తేజో వెంకటకుమార్ చెప్పారు. ఈ దాడుల్లో తనతో పాటు విజయనగరం డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

ట్యాబ్‌ల పంపిణీ

చీపురుపల్లి: రామలింగపురంలో మంగళవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసమ్మ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గొర్లె పద్మ, వెలుగు ఏపీఎం రాజశేఖర్, సీసీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలమాంబకు ప్రత్యేక పూజలు


పోలమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

గరుగుబిల్లి: మరుపెంట పంచాయతీ సాంబన్నవలసలోని చినశంబర పోలమాంబ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా చినశంబర జాతర ఘనంగా నిర్వహించేవారు. కొవిడ్ కారణంగా, అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని జాతరను రద్దు చేశారు. అయితే గ్రామస్థులు పోలమాంబ అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి, ఎదురు మొక్కులు చెల్లించుకున్నారు.